

వన్యప్రాణులకు జల సౌకర్యం
వన్యప్రాణులకు సహజ సిద్ధమైన నీటిని అందించేందుకు అటవీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నీటికుంటలు, ర్యాంప్‌వెల్స్, సోలార్ పంపులు ద్వారా నీరందిస్తున్నారు. 8లో▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ శుక్ర : 6:27 | సహర్ శని : 4:54

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.0 /23.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

జనం గొంతుక !

సాక్షి CELEBRATING 15 YEARS



- ప్రజాసేవలో 'సాక్షి' అక్షర యజ్ఞం
- 15ఏళ్లుగా పాఠకులతో మమేకం
- నిత్యం ప్రజల సమస్యలపై పోరాటం
- జిల్లా అభివృద్ధిలో తమ వంతు పాత్ర

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తాగునీటికి అల్లాడుతున్న ప్రజల పక్షాన 'సాక్షి' గొంతుకైంది. అభాగ్య వృద్ధురాలికి అన్నం పెట్టే అక్షరమైంది. బస్సు రాని ఊరికి బస్సు నడిచేలా చేసింది. గూడు లేని బాధితులకు నీడనిచ్చింది. అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అండగా నిలిచి అక్షరమై దాతలను కదిలించింది. ఆపన్నహస్తం అందడంతో ఆరోగ్యం మెరుగైంది. ప్రభుత్వ పథకాలు, సంక్షేమం అర్హులకు అందేలా చేసింది. రోడ్డు లేక ప్రజలు పడుతున్న కష్టాలపై కథనమై దారి చూపింది. విద్య, వైద్యం, ఆరోగ్యం మెరుగుపర్చేలా, సమస్య ఏదైనా ప్రతీ రోజూ అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు అక్షర వారధిగా నిలుస్తోంది. ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలకు 'సాక్షి'గా నిలుస్తోంది. గత పదిహేనేళ్లలో ప్రజానీకంతో మమేకమవుతోంది. నేడు 'సాక్షి' 15వ వార్షికోత్సవం నేపథ్యంలో అక్షర యజ్ఞానికి మళ్లీ పునరంకితమవుతోంది. జనం శ్రేయస్సు కోసం పాటుపడుతుందనడానికి ఈ స్పందనలే 'సాక్షి'.

కథనాలతో మార్పు
రోజు వారీగా ప్రచురితమవుతున్న 'సాక్షి' కథనాలతో అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. గోదావరి నదిపై మరో బ్రిడ్జి నిర్మాణం మరుగున పడితే మళ్లీ ప్రభుత్వంలో కదలిక వచ్చేలా చొరవచూపింది. డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ జాప్యం, ప్లాస్టిక్ వాడక నిర్మూలన, పట్టణాల్లో పార్కింగ్ సౌకర్యాలు, రాష్ట్ర, జాతీయ రహదారుల నిర్మాణాలు, రైలు మార్గాల్లో ప్రయాణికుల అవస్థలపై వార్తలు వెలువడ్డాయి. కోవిడ్ సమయంలో అనేక జాగ్రత్తలతోపాటు వ్యాక్సిన్ లభ్యత, అందుబాటులోని సౌకర్యాలు, లోపాలు, లాక్‌డౌన్ కష్టాలు, వెలుగులోకి తెచ్చింది. ఆపదలో ఉన్న వారికి అనేక మంది దాతల సాయంతో అభాగ్యులకు ఆపన్నహస్తం అందించింది.

అక్రమాలు వెలుగులోకి..
జిల్లాలో భూ దందాలపై వరుస కథనాలతో ప్రభుత్వ భూములతోపాటు బాధితులకు న్యాయం చేసేలా చేసింది. జిల్లా కేంద్రంలోని సర్కారు భూములు, చెరువుల రక్షణకు పాటు పడింది. నస్పూర్, మందమర్రి, రామక్రిష్టాపూర్, బెల్లంపల్లి, చెన్నూరు, హాజీపూర్, దండేపల్లి, జన్నారం మండలాల్లో అక్రమ కబ్జాలపై కలం ఝులిపించింది. ప్రజాప్రతినిధుల నుంచి అధికారులు, రియల్ వ్యాపారులు ఎవరున్నా జంకు లేకుండా వార్తలు వేసింది. ఇక ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై కథనాలు వచ్చాయి. డీఎంఎఫ్‌టీ నిధులు, సీఎస్సార్, పౌరసరఫరాలశాఖ, రవాణా, ఎక్సైజ్, పోలీసు, స్టాంప్స్, రిజిస్ట్రేషన్లు, మున్సిపాలిటీలు, విద్యుత్ తదితర శాఖల్లో అవినీతిని బయటకు తెచ్చింది.

సింగరేణి కార్మికుల కోసం



సింగరేణి కార్మికుల కోసం ఎప్పటికప్పుడు తమ సమస్యలను వార్త రూపంలో ప్రచురిస్తూ వస్తోంది. కార్మిక పోరాటాలు, శ్రమ శక్తికి ప్రాధాన్యతనిస్తూ వస్తోంది. గోలేటి నుంచి ఇందారం దాకా బొగ్గు గనుల్లో అసౌకర్యాలు, లాభ, నష్టాలు, కార్మిక వాడలపై ఎల్లప్పుడూ కథనాలు ప్రచురిస్తూనే ఉంది. యాజమాన్యానికి కార్మిక లోకానికి మధ్య 'సాక్షి'గా నిలుస్తోంది.

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం కన్నాల శివారులో సర్వే నెంబర్ 45లో ప్రభుత్వ భూమి ఉంది. ఆ చెరువు శిఖం భూమి కబ్జాకు ఓ రియల్టర్ వేసిన పన్నాగాన్ని 'సాక్షి' బట్టబయలు చేసింది. 2011 డిసెంబర్ 15న 'ఎర్రకుంటకు ఎసరు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన నీటి పారుదల, రెవెన్యూ అధికారులు ఎర్రకుంట చెరువు వద్దకు మండల సర్వేయర్, ఇతర సిబ్బందిని పంపించి హద్దురాళ్లు ఏర్పాటు చేసి అన్యాక్రాంతమైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

బడికి బస్సు నడుస్తోంది..



విద్యార్థుల ఇబ్బందులపై కథనం
చెన్నూర్: కోటపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 350 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రతీ రోజు చెన్నూర్ నుంచి ఆర్టీసీ బస్సులో కోటపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్తుంటారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడం, పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో 200 మందికి ఒకే బస్సు' శీర్షికన 2021 నవంబర్ 15న కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని ఎన్ఆర్ఐ తోడే కృష్ణారెడ్డి ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ట్వీట్ చేశారు. స్పందించిన ఆయన విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించారు.

రెగ్యులర్‌గా వస్తుంది..



ఒకే బస్సులో రెండు వందలకు పైగా విద్యార్థులం వెళ్లాం. చెన్నూర్ నుంచి కోటపల్లికి వెళ్లే వరకు చాలా ఇబ్బంది పడ్డాం. 'సాక్షి' మా ఇబ్బందులను గుర్తించి వార్త ప్రచురించింది. ఆనాటి నుంచి ఆర్టీసీ బస్సు సక్రమంగా నడుస్తుంది. 'సాక్షి' పత్రికకు నా కృతజ్ఞతలు
– నౌనూరి సృజన్, 10వ తరగతి, మోడల్‌స్కూల్, చెన్నూర్

ఇది ముమ్మాటికీ 'సాక్షి' చొరవే..



బస్సు సౌకర్యం చక్కగా లేక పిల్లవాడు స్కూల్ వెళ్లి వచ్చే వరకు భయపడ్డాం. ఒక్క బస్సులో 200లకు పైగా మంది పిల్లలతోపాటు ప్రయాణికులు వెళ్లేవారు. ఒక్కో రోజు బస్సు ఆలస్యంగా వచ్చేది. 'సాక్షి' చొరవతో గత ఏడాదిన్నర నుంచి బస్సు సక్రమంగా నడుస్తుంది. పిల్లలు బస్సులో సౌకర్యంగా వెళ్లి వస్తున్నారు. 'సాక్షి'కి ధన్యావాదాలు.
– సామల మోహన్, విద్యార్థి తండ్రి, చెన్నూర్

పసివాడి ప్రాణం నిలిచింది..

- 'సాక్షి' కథనంతో చలించిన దాతలు
- వైద్య ఖర్చులకు రూ.6 లక్షలు పోగు



కాలేయం శస్త్ర చికిత్స అనంతరం ప్రచురితమైన కథనం
జన్నారం: మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన గొలాట రజిత, లక్ష్మణ్ దంపతుల కుమారుడు తేజాన్ష(3) కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని 'సాక్షి' 2020 జూన్ 9న 'ఆపదలో పసిప్రాణం' శీర్షికన ప్రచురించింది. కరోనా కాలంలో కూడా ఎంతోమంది దాతలను కదిలిచింది. ఎందరో ముందుకు రాగా ఆర్థికసాయం అందింది. కవ్వాల్ గ్రామానికి చెందిన అమరగొండ తిరుపతి ఈ కథనాన్ని ట్విట్టర్‌లో పోస్టు చేయగా మంత్రి కేటీఆర్ స్పందించి కుటుంబీకులతో మాట్లాడారు. బతుకుదెరువు కోసం దుబాయిలో ఉన్న లక్ష్మణ్ స్వగ్రామానికి తిరిగి రాగా.. దాతలు, ప్రభుత్వ సాయంతో ఆపరేషన్ చేసి లక్ష్మణ్ కాలేయంలో కొంత భాగం కొడుకు తేజాన్షకు అతికించారు. దీంతో ఆపదలో ఉన్న ఆ పసివాడి ప్రాణం నిలిచింది. ఆపరేషన్ పూర్తయ్యే వరకు 'సాక్షి' తోడుగా ఉంది. సుమారుగా రూ.13 లక్షలు ఖర్చు కాగా, దాతల ద్వారా రూ.6 లక్షల వరకు సహాయం అందింది. దీనికి తోడు లక్ష్మణ్ కొంత ఖర్చు చేసుకుని కుమారుడిని దక్కించుకున్నాడు.

ఎన్నటికీ మరువలేం
అనారోగ్యంతో నా కొడుకు మంచం పట్టగా, నా భర్త లక్ష్మణ్ దుబాయిలో ఉన్నాడు. కదులలేని స్థితిలో ఉన్న నా కొడుకును చూసి కన్నీరు పెట్టుకున్న. 'సాక్షి' పత్రికలో వచ్చిన వార్త నాకు బలం చేకూర్చింది. దాతలు సహాయం చేశారు. దాతల సహాయం, ప్రభుత్వ సహకారంతో నా భర్త లివర్ తీసి కొడుకుకు ఆపరేషన్ చేసి వేశారు. నా కొడుకు బతికాడంటే దాతలు, 'సాక్షి' పేపర్ కారణం. ఎప్పటికీ ఈ మేలు మరువలేను. – **రజిత, తేజాన్ష తల్లి**



నెన్నెల: రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబంలో తల్లి క్యాన్సర్, తండ్రి పక్షవాతం బారిన పడ్డారు. దీంతో ఇద్దరు పిల్లలు బడి మానేసి కూలికి వెళ్తూ పడుతున్న బాధలను ఈ నెల 20న 'సాక్షి' వెలుగులోకి తేవడంతో దాతలు, నేతలు కదిలి ఆర్థికసాయం అందించారు.

- నెన్నెల మండల కేంద్రానికి చెందిన గడ్డం శంకర్‌గౌడ్, మనమ్మ దివ్యాంగ దంపతుల చిన్న కొడుకు ఇంటర్ విద్యార్థి మహేష్‌గౌడ్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. ఈ తీరుపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మంత్రి కేటీఆర్ స్పందించారు. దాతలు రూ.3 లక్షలకుపైగా ఆర్థిక సాయం అందజేశారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ పంచాయతీలో అవినీతి, అక్రమాలు, కబ్జాలపై 'సాక్షి'లో 2021 జులై నుంచి వరుస కథనాలు ప్రచురించింది. ఇటీవల 'సాక్షి' కథనాలతోపాటు ఎంపీటీసీ, స్థానికులు కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల విచారణ అనంతరం పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



తాండూర్: మండల కేంద్రం రేచినీ రోడ్ రైల్వే స్టేషన్ ముందు ప్రభుత్వ భూమి కబ్జాకు కొందరు ప్రజాప్రతినిధులు గొడవ పడిన తీరును 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. 'ప్రభుత్వ భూమి.. ప్రజాప్రతినిధుల లొల్లి' శీర్షికన ఫిబ్రవరి 9న ప్రచురితమైన కథనానికి జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ స్పందించారు. ప్రభుత్వ భూమిని సందర్శించి హద్దురాలు, ఫెన్సింగ్ తొలగింపజేశారు. ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేయించారు.

మా పాలిట దైవమైంది..



నెన్నెల: కిడ్నీ, లివర్, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాను. చిల్లిగవ్వ లేక ఆస్పత్రికి పోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్న నాకు 'సాక్షి' పెద్ద దిక్కు అయింది. మా పాలిట దైవమైంది. నేను, నా పిల్లలు పడుతున్న గోసను పేపర్‌లో రాసిన తర్వాత ఎంతోమంది దాతలు పైసలు తెచ్చి ఇచ్చి ఆస్పత్రికి పంపారు. డబ్బులు సరి పోకపోతే బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య ఆస్పత్రికి ఫోన్ చేసి బిల్లు నేను ఇస్తానని చికిత్స చేయించాడు. ఇప్పుడు ఆరోగ్యం కుదుట పడింది. నా ముగ్గురు పిల్లలు, భర్తతో సంతోషంగా ఉన్నాను. బతికున్నంత కాలం మేము 'సాక్షి'ని మర్చిపోలేము.
– చింతపుడి లక్ష్మి, గ్రామం: జోగాపూర్, మం: నెన్నెల

పింఛన్ వచ్చేలా చేసింది



నెన్నెల: సార్ల తప్పిదంతో సంవత్సర కాలంగా ఆసరా పింఛన్‌కు దూరమై తిండి, మందు గోలీలకు పైసలు లేక తిప్పలు పడ్డా. కలెక్టర్‌ను రెండు సార్లు కలిసి, అధికారులు, నాయకుల కాళ్లు మొక్కిన పింఛన్ రాలేదు. 'సాక్షి' కడుపు సల్లగుండా పేపర్‌లో రాయగానే పట్టణం నుంచి పెద్దసార్లు వచ్చిండ్రు. వారంలోనే పింఛన్ ఇచ్చిండ్రు. ఎవరితో కాని పని 'సాక్షి' పేపర్‌తో అయ్యింది. మాలాంటి దిక్కు లేనోళ్లకు 'సాక్షి' అండగా నిలిచింది. జీవితాంతం 'సాక్షి'కి రుణపడి ఉంటాం.
– గజెల్లి భూదేవి, నెన్నెల

న్యూస్‌రీల్

ఎన్నికల పరికరాల తరలింపు



తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: భవిష్యత్తులో నిర్వహించే ఎన్నికల వ్యవస్థలో ఉపయోగించడానికి వీలులేని ఎన్నికల పరికరాలను నస్పూర్‌లోని ఈవీఎం గోదాము నుంచి తిరుపతికి తరలించినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నస్పూర్‌లోని ఈవీఎం గోదాముల్లో భద్రపరిచిన పాత వర్షన్ కలిగిన 805 ఈసీఐఎల్, ఎం–2, వీవీ ప్యాట్‌లను విధ్వంసం చేసేందుకు తిరుపతికి తరలించామని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, ఆర్‌డీఓ వేణు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 327 మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్/లక్సెట్టిపేట: జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలకు 327 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురువారం మొదటి సంవత్సరం మాథ్స్, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 5,653 మందికి గాను 5,326 మంది హాజరు కాగా 327 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విద్యార్థులు 4,322 మందికి గాను 4,112 మంది హాజరుగా 210 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,331 మందికి గాను 1,214 మంది హాజరు కాగా 117 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో శైలజ తెలిపారు. లక్సెట్టిపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని డీఐఈవో శైలజ సందర్శించారు. నీటి వసతి, సౌకర్యాలు, వైద్య శిబిరం, పోలీస్ బందోబస్తు పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ సౌజన్య, కళాశాల ప్రిన్సిపాల్ లలితకుమారి పాల్గొన్నారు.

విస్తరిస్తున్న 'క్షయ'



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్ధారణ కేంద్రం

- అదుపులోకి రాని రోగుల సంఖ్య
- ఏటేటా పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు
- నేడు ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం

మంచిర్యాలటౌన్: జిల్లాలో క్షయ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. చిన్నపాటి దగ్గు కదా అని నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణాంతకంగా మారుతోంది. 'అందరం కలిసి క్షయను నిర్మూలించగలం' అనే నినాదంతో ఈ ఏడాది అధికార యంత్రాంగం ముందుకెళ్తోంది. నేడు ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం. క్షయ వ్యాధి(టీబీ)ని పూర్తిగా నియంత్రించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. కొన్నేళ్లుగా వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తోంది. అయినా ఏటేటా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడంతో ఆందోళన కలిగిస్తోంది. 2025 నాటికి టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో టీబీ పరీక్షలు చేయడంతోపాటు వ్యాధి నిర్ధారణ తర్వాత మందులు అందిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఆరు నెలల నుంచి ఏడాది వరకు ఉచితంగా మందులు, చికిత్స అందిస్తున్నారు. సరైన సమయంలో మందులు వాడుతూ.. పౌష్టికాహారం తీసుకుంటే పూర్తి స్థాయిలో నయమవుతుందని వైద్యులు చెబుతున్నారు.

చికిత్సతోపాటు నగదు
క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స పూర్తయ్యే వరకు నిక్షయ పోషణ యోజన కింద నెలకు రూ.500 ఇస్తారు. ప్రైవేటు నర్సింగ్‌హోంలు, ల్యాబ్‌లలో పరీక్షలు చేసుకుని వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధిగ్రస్తుల వివరాలను సమీప ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ యూనిట్ సిబ్బందికి తెలియజేయాలి. ఈ డబ్బులతో వ్యాధిగ్రస్తుడు బియ్యం, పప్పుదినుసులు, గుడ్లు, పాలు, కూరగాయలు కొనేందుకు ఉపయోగించాలి. నిక్షయ్ మిత్ర అనే సాంఘిక కార్యక్రమం ద్వారా దాతలు పౌష్టికాహార పదార్థాలు అందజేస్తారు.

జిల్లాలో గుర్తించిన క్షయ(టీబీ) కేసులు

సంవత్సరం	కేసులు
2017	970
2018	1035
2019	1310
2020	1138
2021	1284
2022	1445
2023	183 (మార్చి 22 వరకు)

మందులు వాడితే నయం



చిన్నారులకు బీసీజీ టీకా వేయడం వల్ల వారు క్షయబారిన పడే అవకాశాలు తక్కువ. క్షయ వ్యాధి వచ్చిన వారు మందులు సక్రమంగా వాడితే పూర్తిగా నయమవుతుంది. మంచి పౌష్టికాహారం తీసుకోవాల్సి ఉంటుంది. రెండు వారాల కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉండి, సాయంత్రం జ్వరం వచ్చే వారు ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి.
– డాక్టర్ ఫయాజ్‌ఖాన్, క్షయ నియంత్రణ జిల్లా అధికారి

ఇలా గుర్తిస్తారు..
రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, సాయంత్రం వేళ జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతినొప్పి, దగ్గినప్పుడు దగ్గులో రక్తంతో కూడిన తెమడ వస్తే వ్యాధి లక్షణాలుగా వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధిగ్రస్తుడు దగ్గినా, తుమ్మినా తుంపర్లు వాతావరణంలో కలిసి బ్యాక్టీరియా ద్వారా ఇతరులకు సంక్రమిస్తుంది. హెచ్ఐవీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు, అతిగా మద్యం సేవించేవారు, పొగతాగేవారు, గర్భిణులు, పిల్లల తల్లులు, సరైన పోషకాహారం తీసుకోని వారు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు త్వరగా వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి నిర్ధారణకు అధునాతనమైన సీబీనాట్(క్యాట్రిజ్ బేస్‌డ్ న్యూక్లిక్ ఆసిడ్ ఆంప్లీ క్లీన్ టెస్టు) విధానం (క్షయ నివారణ విభాగం కేంద్రం) మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఉండగా, బెల్లంపల్లి సీహెచ్‌సీలో టునాట్ మిషన్లను అందుబాటులోకి తెచ్చారు. జిల్లా ఆసుపత్రిలో టీబీ టెస్టుల కోసం ప్రత్యేకంగా గదిని కేటాయించి, సీబీనాట్‌తో క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. చికిత్సలో భాగంగా వ్యాధిగ్రస్తులు ప్రతీరోజు మందులు వేసుకునేలా ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) విధానాన్ని అనుసరిస్తున్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

మంచిర్యాలక్రైం: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, గుడ్‌ఫ్రైడే పండుగల నేపథ్యంలో గురువారం స్థానిక డీసీపీ కార్యాలయంలో వివిధ మతాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదరభావంతో పండుగలు జరుపుకోవాలని, మత, రాజకీయ పరమైన వదంతులను పట్టించుకోవద్దని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా, మతాలను కించపరిచే విధంగా పోస్ట్ చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు తిరుపతిరెడ్డి, నరేందర్, సదయ్య, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మేకల సంత వేలం రూ.45.20 లక్షలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం మేకల సంత కోసం బహిరంగ వేలం నిర్వహించారు. రూ.45.20 లక్షలకు మంచిర్యాలకు చెందిన అంబటి రంజిత్ దక్కించుకున్నాడు. అంబటి రంజిత్, అప్పాసు శ్రీకాంత్ వేలంలో పోటీపడ్డారు. ఈ నెల 18న నిర్వహించిన వేలంలో ఎద్దు మధూకర్ రూ.48.60 లక్షలకు దక్కించుకున్నా సంత నిర్వహణకు ముందు రాలేదు. దీంతో రెండోసారి వేలం పాట నిర్వహించారు. సర్పంచ్ వోలపు శారద, ఉప సర్పంచ్ బొడ్డు స్వరూప, వార్డు సభ్యులు, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్తు ప్రతిభ, కారోబార్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దయ్య దేవుణ్ని దర్శించుకున్న 'పొన్నం'



పెద్దయ్య దేవుణ్ని దర్శించుకుంటున్న ప్రభాకర్

దండేపల్లి: మండల కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో పెద్దయ్య దేవుణ్ని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గురువారం దర్శించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు స్వాగతం పలికి, ఆలయం వరకు వెళ్లారు. దేవుణ్ని దర్శించుకుని పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అటవీ ప్రాంతంలో ప్రకృతి దృశ్యాలను చూసి పులకించిపోయారు.

సీపీఎం జనచైతన్య యాత్రలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఎం జనచైతన్య యాత్రలు నిర్వహిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి తెలిపారు. గురువారం హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలోని ఇటుక బట్టీల వద్ద సీపీఎం జనచైతన్య యాత్ర ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న జిల్లాలోని తాండూరు మండలం పెగడపెల్లిలో యాత్ర ప్రారంభమై మంచిర్యాల ఐబీ చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు దుంపల రంజిత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.
కాసిపేట: మండలంలోని కొత్త తిరుమలాపూర్, ఆదివాసీగూడేల్లో సీపీఎం జనచైతన్యయాత్ర పోస్టర్లు ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, నాయకులు సిడాం జంగుబాయి, టేకం శంకర్, టేకం మారుతి, తిరుపతి, ఆదివాసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెన్నూర్‌లో చోరీ



పరిశీలిస్తున్న ఎస్సై మహేందర్

చెన్నూర్: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. సీఐ వాసుదేవరావు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీలో నివాసం ఉంటున్న తొలుపునూరి బాలరాజు బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం కోటపల్లికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉంచిన 25 గ్రాముల బంగారం, కిలో వెండి అపహరణకు గురైనట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని ఎస్సై మహేందర్ సందర్శించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఇర్ఫాన్ నగర్ కాలనీలో...

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఇర్ఫాన్‌నగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఫాతిమా రెండు రోజుల క్రితం ఇంటికి తాళంవేసి ఊరికి వెళ్లింది. బుధవారం రాత్రి దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, రూ.30 వేల నగదు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ బుద్దే స్వామి, ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు, గుడుంబా స్వాధీనం



పట్టుకున్న దేశీదారు, గుడుంబా

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లిలో గురువారం దేశీదారు, గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ ఆధ్వర్యంలో గ్రామంలో తనిఖీలు చేపట్టగా భారతి మండల్ ఇంట్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న 80 దేశీదారు బాటిళ్లు, 10 లీటర్ల గుడుంబా లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి రిమాండ్

దండేపల్లి: ఇంట్లో అక్రమంగా కలప నిల్వచేసిన మండలంలోని తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలోని తపాలాపూర్‌కు చెందిన మామిడి భూమన్నపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌ఆర్వో రత్నాకర్‌రావు తెలిపారు. నిందితుడిని గురువారం రిమాండ్ చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన పేర్కొన్నారు.

పుస్తెలతాడు అపహరణ

కాసిపేట: మండలంలోని కోనూరులో బుధవారం రాత్రి పత్తిపాక లక్ష్మి అనే మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి పుస్తెలతాడు అపహరించినట్లు దేవాపూర్ ఎస్సై విజయేందర్ తెలిపారు. ఇంటి వరండాలో పడుకుని ఉండగా దొంగిలించి పారిపోయినట్లు మహిళ భర్త రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారిని కరిచిన కుక్క



బాలుని చేతిపై కుక్క కాటు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపతినగర్‌లో ఓ బాలుడిపై కుక్క దాడిచేయడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం బాలుడు వరణ్ తమ ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా అటువైపుగా వచ్చిన కుక్క ఒక్కసారిగా అతనిపై దాడిచేసి ఎడమచేతిపై కరిచింది. గమనించిన కుటుంబసభ్యులు కుక్కను తరిమి బాలుడిని ముందుగా మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మందమర్రిలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

- సహజసిద్ధమైన నీటిని అందించేందుకు చర్యలు
- నీటికుంటలు, ర్యాంప్‌వెల్స్, సోలార్ పంపులు వినియోగం
- ఎత్తైన ప్రదేశాల్లో సాసర్ వెల్స్ ఏర్పాటు



ర్యాంప్‌వెల్‌లోని నీటిని తాగుతున్న వన్యప్రాణులు

వన్యప్రాణులకు జలసౌకర్యం

జన్నారం(ఖానాపూర్): వేసవికాలం సమీపించడంతో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. కవ్వాల్ టైగర్‌జోన్‌లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అధికారులు చర్యలు మొదలుపెట్టారు. మూగజీవాలకు సహజసిద్ధమైన నీటిని అందించేందుకు పనులు ప్రారంభిస్తున్నారు. నిల్వ ఉన్న నీటితో పాటు సహజసిద్ధమైన జలధారలు, వాగుల్లోని నీటిని వన్యప్రాణులు ఇష్టంగా తాగే అవకాశం ఉంది. దీంతో అడవిలో నీటికి కొరత లేకుండా జలధారలు, నీటి చెలిమలు, వాగుల నీటిని అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాటితో పాటు నీటికుంటల ద్వారా, ర్యాంప్‌వెల్‌లు, సోలార్ పంపులు, సాసర్ వెల్స్ ద్వారా నీటిని అందించనున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఖానాపూర్, జన్నారం, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అటవీ డివిజన్లలో టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు నీటిసౌకర్యంపై అధికారులు దృష్టి సారించారు.

నీటికుంటలపైనే దృష్టి

అటవీ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచడంలో భాగంగా వర్షపునీరు వృథాగా పోకుండా ఉండేందుకు అధికారులు నీటికుంటలపై దృష్టి పెట్టారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో 300 వరకు నీటి కుంటలు ఉన్నాయి. అందులో ప్రస్తుతం 190 నీటికుంటల్లో నీరు నిల్వ ఉంది. మే మాసం వరకు 80 నీటికుంటల్లో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. కోర్ ఏరియాలో నీటి కుంటలను అధికంగా నిర్మించారు. కురిసిన వర్షాలకు కుంటల్లో నీరుచేరి అందులోనే ఇంకిపోతే భూగర్భజలాలు పెరగడంతో పాటు వన్యప్రాణులకు నీటిసౌకర్యం ఉంటుంది.

సాసర్ వెల్స్ ద్వారా నీటిసౌకర్యం

నీటి కుంటలు, సోలార్ పంపులు, ర్యాంప్‌వెల్స్ లేని ప్రదేశాల్లో ఎత్తైన ప్రాంతంలో సీసీ సాసర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అందులోకి ట్యాంకర్ ద్వారా నీటిని నింపి వన్యప్రాణులకు అందిస్తున్నారు. అయితే గతంలో జన్నారం అటవీ డివిజన్‌లో అత్యధికంగా సాసర్ల ద్వారా నీటిని అందించేవారు. దీంతో ట్రాక్టర్ శబ్దానికి వన్యప్రాణులు భయపడే అవకాశం ఉండడంతో వీటి వినియోగం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో వంద సాసర్‌వెల్స్ ఉండగా ఈ ఏడాది 25 మాత్రమే వినియోగించే అవకాశం ఉంది.

మిషన్ భగీరథ నీరు వినియోగం

అడవిలో నుంచి మిషన్ భగీరథ పైపులు వేస్తున్నారు. దీంతో భగీరథ నీటిని కూడా వన్యప్రాణులకు ఉపయోగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మహ్మదాబాద్, చింతగూడ బీట్‌లలో భగీరథ నీటితో కుంటలు నింపి వాటిని వన్యప్రాణులకు ఉపయోగిస్తున్నారు. జింకల పునరావాస కేంద్రంలో సైతం భగీరథ నీటితో కుంటలు నింపడమే కాకుండా గడ్డి పెంపకం కూడా చేపట్టారు. కన్హ రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యటన అనంతరం నూతనంగా ఏర్పడ్డ కవ్వాల్ టైగర్ ప్రాజెక్టులో కూడా అభివృద్ధి జరిపి వన్యప్రాణుల సంఖ్య పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వాగులకు ఆనకట్టలు

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కన్హా టైగర్‌జోన్‌లో ఉన్న మాదిరి కవ్వాల్ టైగర్‌జోన్‌లో కూడా వాగులకు ఆనకట్టలు వేసి సహజసిద్ధమైన నీటిని అందించేందుకు అధికారులు పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రవహించే వాగునీటికి ఆనకట్టలు కడుతున్నారు. వాగునీటికి అడ్డంగా బండరాళ్లు, ఇసుకతో కట్టకట్టడంతో నీరు నిలిచి చెలిమెలా తయారవుతుంది. పారే నీరు శుభ్రంగా ఉండడంతో వన్యప్రాణులు ఇష్టపడుతాయి. జన్నారం డివిజన్‌లో గతేడాది 30 చోట్ల ఆనకట్టలు కట్టారు. ఈ ఏడాది వాటిసంఖ్య పెంచనున్నారు.



వాగులో ఏర్పాటు చేసిన ఆనకట్ట

ర్యాంప్‌వెల్స్

నీటి ఊటలు ఉన్న ప్రదేశంలో మూడు మీటర్ల లోతు, పది మీటర్ల వెడల్పుతో గుంత తవ్వుతారు. అందులోకి స్వచ్ఛమైన నీరు ఊరడంతో ప్రాణులు తాగేందుకు ఇష్టపడుతాయి. గుంతకు రెండు వైపులా ర్యాంపులు ఏర్పాటు చేయడంతో వన్యప్రాణులు అందులో దిగి నీటిని తాగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది ఇలాంటివి 20 వరకు తీశారు. ఈ ఏడాది మరో 25 చోట్ల ర్యాంప్‌వెల్స్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సోలార్ పంపులు

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో సోలార్ విద్యుత్ ద్వారా నడిచే పంపులతో నీటిసౌకర్యం కల్పిస్తున్నారు. వేసవికాలంలో ఎండల తీవ్రతకు కుంటల్లో నీరు ఇంకిపోయే అవకాశం ఉన్నందువల్ల 18 సోలార్ పంపుల ద్వారా నీటిని వదులుతున్నారు.

నీటిసౌకర్యం కల్పించేందుకు చర్యలు



అడవిలో నివసించే వన్యప్రాణులకు ఆహారంతో పాటు నీటిసౌకర్యం కల్పించేందుకు పలురకాల చర్యలు చేపట్టాం. అడవిలోని వాగుల్లో ప్రవహించే నీటికి ఆనకట్టలు కట్టడం, ర్యాంప్‌వెల్స్ ద్వారా సహజసిద్ధమైన నీటిని అందిస్తున్నాం. ఎత్తైన ప్రాంతాల్లో గుట్టల నుంచి వచ్చే జలధారల నీటిని వినియోగించే ఏర్పాట్లు చేస్తున్నాం.
– సిరిపురం మాధవరావు, డెప్యూటీ కన్జర్వేటర్

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వ్యాన్‌ను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో రూరల్ పోలీసులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగజ్‌నగర్‌కు చెందిన యోనాస్, మహారాష్ట్రకు చెందిన అస్లాంలపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బందిపాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

మంచిర్యాలక్రైం: బాలికను వేధించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు, రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి(పోక్సో)జే. మైత్రేయి గురువారం తీర్పునిచ్చినట్లు సీఐ రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన గసికంటి రాజు అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికను ప్రేమపేరుతో వేధించేవాడు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో 2020 అక్టోబర్ 6న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువుకావడంతో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి మైత్రేయి తీర్పునిచ్చారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

నస్పూర్: సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు, ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఏరియా వర్క్‌షాప్‌లో రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సేఫ్టీ ఆఫీసర్ విజయ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించారు. సింగరేణిని ప్రమాదరహిత సంస్థగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఇంజినీర్ రమేశ్‌బాబు, సేఫ్టీ అధికారి రవిశంకర్, ఎస్ఈ సిరికొండ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారంకాని అక్రమ పట్టా వ్యవహారం

జన్నారం(ఖానాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామ శివారులోని 139/1అ/అ సర్వేనంబర్‌లోని రెండెకరాల భూమి అక్రమ పట్టా అయినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో గురువారం కిష్టాపూర్ గ్రామస్తులు అట్టిస్థలంలో గుడిసెలు వేసుకున్నారు. అధికారులు సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో బుధవారం రాత్రి నుంచే గుడిసెలు వేసుకునే కార్యక్రమం కొనసాగుతోంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటకిషన్ అక్కడికి వెళ్లి గుడిసెలు వేసుకోవద్దని సూచించారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేయడం సరికాదని, పట్టా రద్దు చేయాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. పట్టాను రద్దు చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో శాంతించారు. కానీ పట్టా రద్దు అయితేనే ఖాళీ చేస్తామన్నారు. దీంతో అధికారులు వెనుదిరిగి పోయారు.



అధికారులతో కిష్టాపూర్ గ్రామస్తుల వాగ్వాదం

విద్యార్థుల ఆందోళన

ఐటీఐ కళాశాలకోసం కేటాయించిన స్థలంలో గుడిసెలు వేసుకుంటుండడంతో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పందిరి మనిష్, నితీన్, సాయి, సోను, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

‘శ్రమదోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యం’

నస్పూర్(మంచిర్యాల): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా యాజమాన్యం శ్రమదోపిడీకి పాల్పడుతోందని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య ఆరోపించారు. గురువారం ఏరియాలోని ఆర్‌కే 5 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో సర్ఫేస్, అండర్ గ్రౌండ్ మైన్లలో నేడు వేలాది మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్మికులకు విధి నిర్వహణలో ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి ఎలాంటి నిర్దిష్టమైన చట్టం లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏరియాలో ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచర్ల చంద్రమోహన్, ఏరియా ఉపాధ్యక్షుడు బూర వీరేశం, సహాయ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, నాయకులు రంగిశెట్టి శ్రీనివాస్, నందయ్య, శేఖర్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్కె సమ్మయ్య

ఉద్యోగుల భద్రతే ముఖ్యం



కార్మికులకు బహుమతి అందజేస్తున్న సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్

- బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్

కాసిపేట(బెల్లంపల్లి): సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రత, శ్రేయస్సే ముఖ్యమని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్ అన్నారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై స్వయం రక్షకుని(సెల్ఫ్ రెస్క్యూ) ఏర్పాటు, ఉపయోగం, సంరక్షణ నిర్వహణ, భద్రతపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. విషవాయువులు ఉన్న పరిసరాల్లో స్వీయ-రక్షకులు, ఎస్కేప్ ఆపరేటర్ల ఉపయోగంపై ఉద్యోగులకు అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రాథమిక లక్ష్యం అన్నారు. బాటమ్ బ్లాస్టింగ్‌లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఆఫ్ మైన్స్ ఏజెంట్ కుర్మ రాజేందర్, రెస్క్యూ ఇన్‌చార్జి రాంమోహన్, గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, టీబీజీకేఎస్ నాయకులు భైరి శంకర్, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నస్పూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలోని వర్క్‌షాప్‌లో నెలకొన్న సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు డీకొండ అన్నయ్య, చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఏరియా వర్క్‌షాప్‌లో ‘అలాయ్ బలాయ్’ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ జనరల్ సెక్రటరీ చాట్ల అశోక్, పిట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కార్యదర్శి కురుస దుర్గయ్య, నాయకులు బ్రహ్మచారి, ఒల్లాల రవి, మహేశ్‌రాజు, మోహన్, రాయమల్లు, సుధాకర, జితేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

- దర్శనమిచ్చిన నెలవంక
- నేటి నుంచే రంజాన్ మాసం
- శుక్రవారం తొలి ఉపవాసం
- నెలరోజుల పాటు దైవ స్మరణే..

భక్తిభావం.. కఠిన ఉపవాసం



చెన్నూర్‌లో అందంగా ముస్తాబు చేసిన మసీదు

నెన్నెల(బెల్లంపల్లి): ముస్లింలు అత్యంత పవిత్రంగా కఠోర నియమాలతో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టే రంజాన్ మాసం నేటి నుంచి షురూ కానుంది. గురువారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో ఈ నెల 24న శుక్రవారం తెల్లవారు జామునుంచి మొదటి (రోజా) ఉపవాస దీక్షకు ముస్లింలు సిద్ధమయ్యారు. గురువారం రాత్రి నుంచే మసీదుల్లో ఖురాన్ పఠనం, తరావి నమాజ్ ప్రారంభమయ్యాయి. మసీదులను ముస్తాబు చేశారు. వేకువ జామున ఉపవాస దీక్ష (సహర్) ప్రారంభించి సాయంత్రం దీక్ష విడిచే సమయం (ఇఫ్తార్) కోసం పట్టణాల్లో ప్రత్యేక వంటకాలు అందించేందుకు హోటళ్లు కూడా సిద్ధమయ్యాయి. ఇలా 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి మళ్లీ సాయంత్రం విలీన గగనంలో నెలవంకను చూసిన మరుసటి రోజు రంజాన్ జరుపుకుంటారు.

అతి పవిత్ర మాసం

ముస్లింల అతి పవిత్ర గ్రంథమైన దివ్య ఖురాన్ దివి నుంచి భువికి ఈ మాసంలోనే వచ్చిందని వారు విశ్వసిస్తారు. ఈ నెలలో ఉపవాస దీక్ష ద్వారా శరీరాన్ని సుక్షింపజేయడం ద్వారా ఆత్మప్రక్షాళన అవుతుందని వారి నమ్మం. తద్వారా కామ, క్రోధ, మోహ, మద, మత్సార్యాలు అదుపులో ఉంటాయని నమ్మకం. ఉదయాన్నే అన్నపానీయాలు సేవించడాన్ని సహర్ అంటారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించి భోజనాన్ని తీసుకోవడాన్ని ఇఫ్తార్ అంటారు.

30 రోజులను మూడు భాగాలుగా..

రంజాన్ మాసంలో 30 రోజులను మూడు భాగాలుగా విభజిస్తారు. మొదటి పది రోజులు రహమత్‌కే రోజాలు(కరుణ కురిపించే దినాలు), రెండో పది రోజులు మగ్ ఫిరత్‌కే రోజాలు(పాపాల నుంచి క్షమాపణ పొందే దినాలు), చివరి పది రోజులు జహన్నుమ్‌సే ఛుట్కారే రోజాలు(నరకదండన నుంచి విముక్తి కోరే దినాలు)గా పాటిస్తారు.

ప్రత్యేక నమాజ్

ప్రతిరోజు రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు ఈ మాసంలో ప్రత్యేకంగా తరావీ నమాజ్ చేస్తారు. దివ్యఖురాన్‌ను రోజుకు 20 రకాతుల చొప్పున తరావీనమాజ్‌లో 27 రోజుల పాటు హాఫిజ్ పాటిస్తారు. రాత్రి పూట ఇషానమాజ్ అనంతరం తరావీ నమాజ్ జరుగుతుంది. ఇలా 25 రోజుల తరావీనమాజ్ జరిపిన తర్వాత 26వ రోజు సబ్ ఏ ఖదర్ రాత్రి నుంచి ఈదు ఉల్‌ఫితర్ వరకు ఉపవాస దీక్షను ఆచరిస్తారు. ఇహలోకంలో ఆచరించే కఠోర దీక్షలు మనల్ని పరలోకంలో కాపాడుతాయని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. రంజాన్ మాసంలో ఉపవాసాలు, ధానధర్మాలతో గడిపిన వారి ప్రార్థనలను అల్లాహ్ ఆలకిస్తాడని, వారి పాపాలు పరిహారమై అగ్నిసంస్కారం పొందిన బంగారం మాదిరి వారి మోము దివ్యకాంతిలో వెలుగుతుందని వారు విశ్వసిస్తారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 31 లోగా పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం జిల్లా ఖజానాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయింపు శ్రీనివాస్‌రావు, రవికుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం మరో వారంరోజుల్లో ముగియనుందని, వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి చీర సమ్మయ్య, ఉపాధ్యక్షులు అశోక్, కచ్చాల్, శ్రీధర్, రమాదేవి, నాగేందర్, రమణయ్య, గోపాల్‌రావు, సత్యనారాయణ, సాంబయ్య, మాటేటి రమేశ్, తుల మధుకర్, రాజ్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

ఏడుగురు బైండోవర్

జన్నారం: అటవీ నేరాలకు పాల్పడుతున్న ఏడుగురు వ్యక్తులను గురువారం అటవీశాఖ అధికారులు తహసీల్దార్ వెంకట కిషన్ ఎదుట బైండోవర్ చేశారు. ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన ముగ్గురు, జన్నారం గ్రామ పంచాయతీలోని గోండుగూడకు చెందిన నలుగురిని బైండోవర్ చేసినట్లు రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. మరోసారి నేరాలకు పాల్పడితే రూ.లక్ష జరిమానా లేదా ఏడాది జైలుశిక్ష ఉంటుందని రేంజ్ అధికారి హెచ్చరించారు.



బైండోవర్ చేస్తున్న అధికారులు

వేతన ఒప్పందం అమలుకు పోరాటం



ఎస్‌ఆర్‌పీ 3 గనిపై మాట్లాడుతున్న రాజారెడ్డి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

నస్పూర్(మంచిర్యాల): 11వ వేతన ఒప్పందం అమలు కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఏరియాలోని ఎస్‌ఆర్‌పీ 3 గనిపై సీఐటీయూ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినప్పటికీ మైన్స్ సేఫ్టీ కమిటీ లకు యాజమాన్యం కేవలం టీబీజీకేఎస్ నాయకులనే పిలవడం సరికాదన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి మెండె శ్రీనివాస్, బ్రాంచి కార్యదర్శి గోదారి భాగ్యరాజు, ఉపాధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజర్ కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగల శ్రీనివాస్, భానేష్, అజయ్, గౌస్, గంగాధరచారి, పాల్గొన్నారు.

గని కార్మికుల కష్టం వెలకట్టలేనిది



గనిలోకి దిగుతున్న ఏసీపీ నరేందర్

నస్పూర్(మంచిర్యాల): ప్రకృతికి విరుద్ధంగా పనిచేస్తూ బొగ్గును వెలికి తీస్తున్న సింగరేణి కార్మికుల కష్టం వెలకట్టలేనిదని జైపూర్ ఏసీపీ నరేందర్ అన్నారు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీరాంపూర్ ఆర్‌కే 7 గనిని సందర్శించారు. గనిలోని 2ఎన్15 డిస్ట్రిక్‌ను పరిశీలించారు. గని లోపల పని స్థలాల్లో కార్మికులు బొగ్గు వెలికితీసే విధానాన్ని గని మేనేజర్ సాయిప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై మానస, పిట్ సెక్రటరి మెండె వెంకటి, రక్షణాధికారి రవిశంకర్, అండర్ మేనేజర్ వాసుదేవేందర్, ఇంజినీర్ తోట రమేశ్ పాల్గొన్నారు.

వచనా కవితలకు ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం, సచివాలయ భవనం, తెలంగాణ అమర జ్యోతిపై కవులు, కవయిత్రులు, విద్యార్థుల నుంచి వచనా కవితలను ఆహ్వానిస్తున్నట్లు కవిత్వ సంకలనాల సంపాదక మండలి సభ్యుడు గోపగాని రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు అంశాలపై వేర్వేరుగా 25 పంక్తులకు మించకుండా మార్చి 31 లోగా 9440979882 నంబర్‌కు పంపించాలని సూచించారు.